క్లుప్తంగా

రేపు కానుకల లెక్కింపు

నందిగామ టౌన్: మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయ హుండీ కానుకల లెక్కింపు గురువారం నిర్వహించనున్నట్లు ఈఓ హరి గోపీనాథ్ తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణలో కానుకలను లెక్కించడం జరుగుతుందన్నారు. లెక్కింపులో ఆసక్తి కలిగిన భక్తులు పాల్గొనాలని కోరారు. అదేవిధంగా ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారి ఆలయంలో పూజా సామగ్రి విక్రయించుకునే హక్కుకు, అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్లు విక్రయించే హక్కుకు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



దేచుపాలెం(వత్సవాయి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ఎస్. నరసింహారావు తెలిపారు. దేచుపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. పలువురు రైతులు సమస్యలపై అర్జీలను అందజేశారు. ముఖ్యంగా ఖాతా నంబర్లలో మార్పులు, విస్తీర్ణంలో తేడాలు, అడంగల్‌లో పేర్ల తప్పులపై అర్జీలు అందించారు. త్వరలోనే అర్జీలను పరిష్కరించడం జరుగుతుందని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లం నారాయణ ప్రసాద్, డీటీ కె. ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వీరులపాడు: గ్రామాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ హుసేన్ పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్వోలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండటమే కాకుండా వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా వీఆర్వోల పని తీరుపై ఫిర్యాదులు వస్తున్నాయని పద్ధతిగా నడుచుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎంపీడీవో పర్యటన



గౌరవరం(జగ్గయ్యపేట): గ్రామంలోని సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో నితిన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన గ్రామంలో పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు ఏర్పాటు చేసినా పైప్‌లైన్లు ఏర్పాటు చేయలేదని చెప్పారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం వర్షం వచ్చిన సమయంలో నీట మునుగుతుందని, అంగన్‌వాడీ, సచివాలయ భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం తడి పొడి చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన కొత్త నాగరాజు కుమారుడు భవదీప్ కాలుకు ఆపరేషన్ కారణంగా విజయవాడలోని ప్రయివేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. భవదీప్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ. 5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు.

నైపుణ్య గణనపై అధికారులకు శిక్షణ

జి.కొండూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటా నిర్వహించనున్న నైపుణ్య గణన సర్వేపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి స్థానిక కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి రవితేజ అధికారులకు ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో సర్వే చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

- ప్రమాదకరంగా ప్రధాన రహదారులు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం, పవిత్ర పుణ్య క్షేత్రం పెనుగంచిప్రోలు నుంచి వెళ్లే రహదారులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. పెనుగంచిప్రోలు నుంచి జాతీయ రహదారి ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వరకు తొమ్మిది కిలోమీటర్లు, పెనుగంచిప్రోలు నుంచి జగ్గయ్యపేట వెళ్లే మక్కపేట వరకు ఆరు కిలోమీటర్లు ప్రధాన రహదారి మొత్తం పెద్ద గోతులు పడ్డాయి. అలాగే పలు చోట్ల రహదారిపై కంకర బయటకు వచ్చి దారుణంగా మారింది. పొలాలకు పైపులైన్ కోసం గోతులు తీసి వదిలేయడంతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ రహదారిపై ఆదమరిస్తే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రాత్రుళ్లు గుంతలు కనపడక పలువురు వాహనదారులు పడి గాయాల పాలైన సంఘటనలు కూడా ఉన్నాయి.

నిత్యం వేలాది మంది ప్రయాణం

శ్రీ తిరుపతమ్మవారు కొలువైన పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రానికి నిత్యం ఈ రహదారులపై వేలాది మంది భక్తులు వందలాది వాహనాల్లో తరలివస్తారు. ఎంతో ప్రాధాన్యమున్న ఈ రహదారులను పట్టించుకునే వారు కరువయ్యారు. భారీ వర్షాలకు గతంలో కంటే రహదారులు మరింత దెబ్బతిన్నాయి. పెనుగంచిప్రోలు చెరువుకట్ట సమీపంలో వరదలకు రోడ్డు కొట్టుకుపోవడంతో తాత్కాలికంగా మట్టివేశారు. అక్కడ పెద్ద గుంతలు పడి ముఖ్యంగా కార్లు కింద తగిలి పాడవుతున్నాయి. దీనిపై ఆర్అండ్‌బీ అధికారులను వివరణ కోరగా అనుమతులు వచ్చిన వెంటనే రహదారుల మరమ్మతులు చేపడతామని చెబుతున్నారు.



ముండ్లపాడు వెళ్లే రహదారిలో చెరువు కట్ట వద్ద గోతులు



మక్కపేట దారిలో పైపులైన్ కోసం తీసిన గుంతలు



మక్కపేట వెళ్లేదారిలో రహదారి మధ్యలో ఏర్పడిన గోతులు

పెద్ద గోతులు పడ్డాయి



పెనుగంచిప్రోలు నుంచి ముండ్లపాడు మీదుగా జాతీయ రహదారి వరకు రోడ్డు మొత్తం పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ప్రయాణాలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రాత్రుళ్లు రహదారి మధ్యలో ఉన్న గోతులు కనపడటం లేదు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అధికారులు తక్షణం మరమ్మతులు నిర్వహించాలి.

–గుంటుపల్లి వాసు, ముండ్లపాడు

మరమ్మతులు చేయాలి



మండల కేంద్రం పెనుగంచిప్రోలు పవిత్ర పుణ్యక్షేత్రానికి నిత్యం వేలాదిగా భక్తులు తరలివస్తారు. రహదారులు మాత్రం దారుణంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా గోతులమయంగా మారింది. వందల సంఖ్యలో నిత్యం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. అధికారులు వెంటనే స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలి.

–కనకపూడి భాస్కరరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు

ట్రూఅప్ చార్జీలు ఉపసంహరించుకోవాలి

జగ్గయ్యపేట అర్బన్: అదనపు ఇంధన చార్జీల పేరిట విద్యుత్ వినియోగదారులపై మోపిన ట్రూఅప్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. డిపో సెంటర్‌లో ఉన్న విద్యుత్‌శాఖ ఏడీఈ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజి, పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాస రావు మాట్లాడుతూ అదనపు ఇంధనం చార్జీల పేరిట ట్రూఅప్ భారం ప్రతిపాదిస్తూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు నోటిఫికేషన్లు జారీ చేయడం అన్యాయం అన్నారు. ఇటీవల మోపిన రూ. 6,072 కోట్ల ట్రూఅప్ భారం ఇంకా అమలులోకి రాకముందే అంతకు రెట్టింపు భారాన్ని ప్రజలపై మోపడం దారుణమన్నారు. మొత్తం కలిపి ప్రజలపై రూ. 17 వేల కోట్ల భారం మోపడం శోచనీయం అని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేసిందని విమర్శించారు. ట్రూఅప్ విధానాన్ని వెంటనే రద్దు చేసి ప్రజలపై మోపిన రూ. 17 వేల కోట్ల భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజల ఆగ్రహం చవిచూడాల్సి వస్తుందని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు మాశెట్టి రమేష్‌బాబు, పోతిపాక వెంకటేశ్వర్లు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి మహ్మద్ అసదుల్లా, పార్టీ నాయకులు భోగ్యం నాగులు, మెటికల శ్రీనివాసరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నందిగామ ఆర్డీవో కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నందిగామ టౌన్: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ప్రదర్శన చేసి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నందిగామ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు సుబ్బారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో వసూళ్లు చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కట్టా చామంతి, మన్నే హనుమంతరావు, జుల్లేపల్లి తుపాన్ బాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

కంచికచర్ల: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో మంగళవారం కంచికచర్ల, వీరులపాడు మండలాల రిటైర్డ్ ఎంప్లాయీస్‌తో ఆ సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచినా 12వ పీఆర్సీ ప్రకటించలేదని అన్నారు. త్వరగా పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. రెండు డీఏలు ఇవ్వాల్సి ఉందని 11వ పీఆర్సీ, డీఆర్ అరియర్స్ చెల్లించాల్సి ఉందని తెలిపారు. అనంతరం విజయవాడ మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేసి ఆరుగురికి కాటరాక్టు శస్త్రచికిత్స చేయాలని గుర్తించారు. సమావేశంలో సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, కోశాధికారి నాగేశ్వరరావు కేవీవీ రమణమూర్తి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు రామ్మోహనరావు

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన

నందిగామ టౌన్: ట్రాఫిక్ నియంత్రణకు సహకరించడం, రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని సీఐ వైవీఎల్. నాయుడు పేర్కొన్నారు. స్థానిక వెంకటేశ్వర కల్యాణ మండపంలో ట్రాఫిక్, రోడ్డు భద్రతా నియమాలపై ఆటో, కారు డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ నాయుడు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు విధిగా యూనీఫాం ధరించాలని మహిళలు, చిన్నారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్లనే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ నాయుడు

అవినీతిపై పోరాటం విద్యార్థుల బాధ్యత

ఐఓసీఎల్ ఆపరేషన్ మేనేజర్ అనిల్‌కుమార్

మైలవరం: సమాజంలో జరుగుతున్న అవినీతిపై పోరాటం విద్యార్థుల బాధ్యత అని కొండపల్లి ఐఓసీఎల్ ఆపరేషన్ మేనేజర్ అనిల్‌కుమార్ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొండపల్లి ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ ఇంటిగ్రిటీ ప్రాధాన్యతను వివరించారు. ఐఓసీఎల్ అసిస్టెంట్ మేనేజర్ నారాయణ మాట్లాడుతూ భారత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారావు మాట్లాడుతూ సమాజంలో అవినీతిని నిర్మూలించాలంటే విద్యార్థి దశ నుంచే అవినీతిపై పోరాటం చేయాలన్నారు. సాంస్కృతిక సంపద అభివృద్ధి, జాతీయ సమైక్యత అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యకమంలో కామర్స్ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ ఎం .శ్రీనివాసరావు, కో–ఆర్డినేటర్ డాక్టర్ జె. రాముడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణ చట్టాలపై అవగాహన

గంపలగూడెం: బాలల హక్కుల రక్షణకు ప్రభుత్వం పలు చట్టాలను అమలు చేస్తోందని జిల్లా బాలల హక్కుల సంరక్షణ సంస్థ కౌన్సిలర్ జీవన్‌కుమార్ అన్నారు. బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలల హక్కులపై జిల్లా బాలల హక్కుల రక్షణ సంస్థ(డీసీపీఓ) ఆధ్వర్యంలో మంగళవారం గంపలగూడెం వెలుగు కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పోక్సో, బాల్య వివాహాల నిషేధిత చట్టం, దత్తత చట్టాలు, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, హెల్ప్ లైన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చట్టాలపై గ్రామాల్లో సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు, వెలుగు కార్యాలయం ఏపీఎం గురవయ్య, ఐసీడీఎస్ గంపలగూడెం సెక్టార్ సూపర్‌వైజర్ మునిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎస్కేలు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు నేడు ఆఖరు తేదీ

కంచికచర్ల: పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవడానికి బుధవారం ఆఖరు తేదీ అని తహసీల్దార్ వి. జాహ్నవి మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ కంచికచర్ల మండలంలో ఉన్న పట్టభద్రులు ఎవరైనా ఓటు నమోదు చేసుకోకపోతే బుధవారం సాయంత్రం ఐదు గంటలలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదు కోసం ఆధార్, ఓటర్ కార్డు, ఏదైనా డిగ్రీ జిరాక్సు సర్టిఫికెట్లపై గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేయించాలని అన్నారు. ఫారం –18తో జతపర్చి తమ కార్యాలయంలో అందజేయాలని తహసీల్దార్ పేర్కొన్నారు.

జగ్గయ్యపేట: కృష్ణ–గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు బుధవారం చివరి తేదీ అని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు సాయంత్రం ఐదు గంటల్లోగా పూర్తి చేసిన దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఏఎన్ఎంపై చర్యలు తీసుకోవాలి

నందిగామ టౌన్: ఆశావర్కర్లను వేధిస్తున్న ఏఎన్ఎంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని లింగాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశావర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల సంఘ నాయకురాలు కమల మాట్లాడుతూ అంబారుపేట గ్రామ ఏఎన్ఎం ఆశావర్కర్లను వేధిస్తున్నారన్నారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు జిల్లా స్థాయి అధికారులకు విన్నవించినా కంటి తుడుపు చర్యలు తీసుకుని చేతులు దులుపుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా కనీస వేతనం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, వయోపరిమితి పెంచాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కటారపు గోపాల్, కర్రి వెంకటేశ్వరరావు, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు వనజ, తిరుమలదేవి, నాగమణి, కవిత తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని అన్నవరం, గరికపాడు, ముక్త్యాల, మల్కాపురం, గండ్రాయి సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే చెక్‌పోస్టుల వద్ద కంటైనర్లు ఏర్పాటు చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇసుక, రేషన్ బియ్యం తదితర అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



మక్కపేటలో పుట్ట వద్ద భక్తులు



జగ్గయ్యపేటలోని శ్రీనాగలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ...



కంచికచర్లలో పొంగళ్లు తయారు చేస్తున్న భక్తులు



గోళ్లమూడి గ్రామంలో సుబ్రహ్మణ్యస్వామి



విద్యానగర్‌లో శ్రీనాగలక్ష్మి అమ్మవారు



పెనుగంచిప్రోలులో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

వత్సవాయి: నాగుల చవితి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వత్సవాయి, పోలంపల్లి, కంభంపాడు, మక్కపేట, భీమవరం, చిట్టేల, మంగొల్లు గ్రామాల్లోని పుట్టల వద్ద మహిళలు ఉపవాసం ఉండి పాలు పోశారు. చిన్నారులకు పుట్టల వద్ద చెవులు కుట్టించారు. మక్కపేటలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయానికి భక్తులు క్యూ కట్టారు.

జగ్గయ్యపేట అర్బన్: నాగుల చవితి వేడుకలు మంగళవారం పట్టణంలోని పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టల వద్దకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. పాలు, గుడ్లు తదితర ప్రసాదాలను పుట్టలో పోశారు. అలాగే ఆలయాల వద్ద పాలపొంగళ్లు, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అలాగే పట్టణ సమీపంలోని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లైమ్ స్టోన్ మైన్స్ క్వార్టర్స్ వద్ద ఉన్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

నాగలక్ష్మి అమ్మవారిని తాకిన సూర్యకిరణాలు

విద్యానగర్‌లోని స్వయంభూ శ్రీనాగలక్ష్మి అమ్మవారి ఆలయంలో సూర్యకిరణాలు సూటిగా అమ్మవారిని తాకడంతో అమ్మవారు దేదీప్యమానంగా వెలుగొందుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు మూర్తి సాంబశివరావు అమ్మవారికి విశేష అలంకరణ చేశారు.

పెనుగంచిప్రోలు: నాగుల చవితి సందర్భంగా మంగళవారం గ్రామాల్లో వేకువజాము నుండే భక్తులు పుట్టలో పాలు పోసి నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసం, నాగుల చవితి కావడంతో మండలంలోని పలు శివాలయాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. పెనుగంచిప్రోలు శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు వేకువజాము నుంచే బారులు తీరారు.

కంచికచర్ల: నాగుల చవితి సందర్భంగా స్థానిక జుజ్జూరురోడ్డులో గల శ్రీ నాగేంద్రస్వామి పుట్ట వద్ద మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు వండి స్వామివారికి సమర్పించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మండలంలోని మున్నలూరు కృష్ణానది ఒడ్డున ఉన్న శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. కీసర, గొట్టుముక్కల, పరిటాల, మోగులూరు, చెవిటికల్లు, గండేపల్లి గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

నందిగామ టౌన్: నాగుల చవితి సందర్భంగా పట్టణంలోని రామలింగేశ్వరస్వామి, కుమార స్వామి, మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి, మాగల్లులోని మదన గోపాలస్వామి, గోళ్లమూడి గ్రామంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలతో పాటు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో జంట నాగులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పుట్టల వద్ద నాగదేవతలకు పాలు పోశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: నాగుల చవితి పండుగను మండలంలో భక్తిశ్రద్ధలతో మంగళవారం జరుపుకొన్నారు. ముక్త్యాల, పోచంపల్లి, కోటిలింగాల, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లోని శివాలయాల్లో పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మైలవరం: మైలవరం ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. మైలవరంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయప్రకాశ్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం సీహెచ్‌సీలో పని చేసేందుకు 15 మందికి పైగా సిబ్బంది అవసరం ఉండగా తొమ్మిది మందితోనే పనిచేయిస్తున్నారన్నారు. తక్షణమే మిగిలిన ఆరుగురిని కూడా నియమించాలని, పెండింగ్‌లో ఉన్న పీఎఫ్‌ను తక్షణమే జమ చేయాలని, కనీస వేతనం రూ. 20 వేలు ఇవ్వాలని కోరారు. ఆస్పత్రి శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు గంటా శ్రీనివాసరావు, వి. రూతమ్మ, వి. రమేష్, సీహెచ్ పెద్ద తిరుపతమ్మ, కె. శర్మ, టి. మేరీ, అనసూయమ్మ, తేరేజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com